క్లుప్తంగా

పప్పు ధాన్యాలతో జాతీయ జండా చిత్రీకరణ



సత్తెనపల్లి: ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా బ్రిటీష్ వారి పాలన నుంచి భారతదేశానికి విముక్తి లభించిందని, ఆ మహానుభావులను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సత్తెనపల్లికి చెందిన యువ ఇంజినీర్ గొల్లపల్లి వీరాంజనేయులు కోరారు. మన దేశంలో 1950 నుంచి ప్రతీ సంవత్సరం జనవరి 26ని గణతంత్ర దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే 2023 జనవరి 26న 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకోబోతున్న నేపథ్యంలో గొల్లపల్లి వీరాంజనేయులు పప్పు ధన్యాలతో జాతీయ జండాను చిత్రీకరించి దేశ భక్తిని చాటలని తలచాడు. దాని కోసం వంటింట్లో వినియోగించే కంది పప్పు, బియ్యం, మెంతులు, మిరియాలు, జొన్నలు, సజ్జలతో బుధవారం జాతీయ జండాను రూపొందించాడు.

రూ. 3.26 కోట్లతో తారు రోడ్డు పనులు



రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం నుంచి మొక్కపాడు మీదుగా బృగుబండ్ల వరకు 4.2 కిలో మీటర్ల తారు రోడ్డు వేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటి వరకు పడిన కష్టాలు నెరవేరినట్లైంది. బుధవారం తారు వేసేందుకు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ ఎస్కె జరీనాతాజ్‌లు నాయకులతో కలిసి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఈ రోడ్డును నిర్లక్ష్యం చేయడంతో మూడు గ్రామాలకు సంబందించిన ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు. గతంలో ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెప్పినా పట్టించుకున్న నాధుడే లేరని వాపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకుని తారు రోడ్డు వేసేందుకు రూ. 3.26 కోట్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డిఈ సుధాకర్, ఏఈ సాయిరాంకిరణ్, కాంట్రాక్టర్ పశ్యవుల నరసింహారావు, సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, గన్నపల్లి వెంకటరమణబుల్లిబాబు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, పశ్యావుల కోటేశ్వరరావు, ఎస్కె సుభాని, ఎస్కె భాషా, ఎంపీటీసీ మహబూబీ, ఎస్కె జానీ, పరమేశ్వరరావు, కేదారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి బుధవారం తెలిపారు. ఈనెల 20వ తేదీన బొల్లవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో పాఠశాలలో చదువుతున్న పెద్దినీడి మల్లిఖార్జునరావు, రావు చరణ్‌తేజలు పాల్గొని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28, 29, 30 వతేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా జి.కొండూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణనిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, క్రీడా ఉపాధ్యాయురాలు షేక్.ఫాతిమాలను, విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్.మస్తాన్‌వలి, గ్రామపెద్దలు అభినందించారు.

మృతుడి మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత



సత్తెనపల్లి: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ డొక్కా చిన్న గుండె పోటుతో మృతి చెందాడు. వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా మృతుని మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు వెల్ఫేర్ సెక్రెటరీ రాజ్యలక్ష్మి బుధవారం మృతుని భార్య ఉషారాణికి అందించారు.

ఫ్లెక్సీలు నిషేధం .. చర్యలు కఠినం

పదేళ్ల కిందటి వరకు ఏ ప్రజా ప్రతినిధి అయినా.. ఏ ప్రభుత్వ కార్యక్రమమైనా, ఏ ప్రైవేట్ సంస్థ తమ ప్రచార కార్యక్రమాలను అయినా గోడలపై రాతలు, చిత్రాల ద్వారా తెలిపేవారు. ప్లాస్టిక్ బ్యానర్లు రాకతో గోడల పై రాతలు, చిత్రాలు కనిపించ కుండా పోయాయి. ఎంతోమంది పెయింటర్లు ఉపాధికి దూరమయ్యారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ బ్యానర్లపై నిషేధం విధించడంతో పెయింటర్లకు మంచి రోజులు వచ్చాయి. మళ్లీ తమ చేతిరాతలకు పని చెప్పి తలరాతను మార్చుకోనున్నారు.

- నేటి నుంచి జిల్లాలో బ్యానర్లు, ఫ్లెక్సీలు నిషేధం
- పెయింటర్లకు ఇక పెరగనున్న డిమాండ్



సత్తెనపల్లిలో ఫ్లెక్సీలను ముద్రిస్తున్న మిషన్



ఫ్లెక్సీ ముద్రణదారులకు నిషేధం పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు(ఫైల్)

సత్తెనపల్లి: 'మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల కారణంగా .. భావితరాలకు అణుబాంబును మించిన ముప్పు పొంచి ఉంది'.. పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంపై గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలివి. దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యలను ప్లాస్టిక్ వాడకం ఎంత ప్రమాదకరమో తెలుసుకోవచ్చు. పట్టణాల్లో పోగవుతున్న వ్యర్థాల్లో సగానికి పైగా ఇవే ఉంటున్నాయి. మానవాళి ఆరోగ్యం ... పర్యావరణం పై పెను ప్రభావం చూపుతున్న బ్యానర్లు, ప్లాస్టిక్ వినియోగం పై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర జేసింది. ఆంధ్రప్రదేశ్ 2027 నాటికి నో ప్లాస్టిక్ జోన్ గా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది ఆగస్టు 26న విశాఖలో జరిగిన సమావేశంలో ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధిస్తూ ప్రకటన చేశారు. తాజాగా ఫ్లెక్సీలో ముద్రణ తయారీ నిలిపి వేయాలంటూ పురపాలక సంఘాల ఆధ్వర్యంలో నిర్వాహకులకు నోటీసులు జారీ కావడంతో ఈ నెల 26 నుంచి నిషేధం అమల్లోకి రానుంది.

రసాయనాలతో...

ప్రస్తుతం పాలీ వినైల్ క్లోరైడ్ ఫ్లెక్సీల వినియోగం పెరిగింది. వీటి తయారీలో ప్రమాదకర వోలటైల్ ఆర్గానిక్ కాంపొండ్స్ (వివోసి) కలుస్తాయి. పునర్వినియోగానికి ఇవి పనికిరావు. వీటిని కాల్చినప్పుడు డయాక్సిన్, కార్సినోంజెన్, టాక్సిన్, యాసిడ్లు వాతావరణంలోకి విడుదలవుతాయి. వీటిని పీల్చితే కళ్ళు, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థకు సంబంధించిన అనారోగ్య సమస్య లు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

చదరపు అడుగుకు రూ. 100 ....

జిల్లా వ్యాప్తంగా ఈనెల 26 తర్వాత ఫ్లెక్సీలు కనిపించినా, ముద్రించినా.. వారి నుంచి చదరపు అడుగుకు రూ.100 చొప్పున లెక్క గట్టి ఫ్లెక్సీ మొత్తానికి అపరాదు రుసుము వసూలు చేయనున్నారు. జిల్లాలో వ్యాపార, వాణిజ్య సంస్థలతోపాటు పెద్ద కంపెనీలు వ్యాపార కార్యకలాపాల ప్రచారానికి ఎక్కువగా వీటిపైనే ఆధారపడుతున్నాయి. ఇందుకోసం కొంతమంది తమ గృహాలపై ఇనుప బోర్డులు ఏర్పాటు చేసుకొని పలు సంస్థలకు చెందిన ప్రకటనల హోర్డింగులు ఏర్పాటు చేసి కొంతమేర ఆదాయం పొందుతున్న సందర్భాలు ఉంటున్నాయి.

నిర్వాహకుల పరిస్థితి...

ఫ్లెక్సీ ముద్రణ యూనిట్ పెట్టాలంటే రూ. 10 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు ఖర్చవుతుంది. జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు బ్యాంకులు నుంచి రుణాలు తీసుకొని యూనిట్లు నెలకొల్పి నెలనెలా బ్యాంకు రుణాలు తీరుస్తున్నారు. ఒక్కో యూనిట్లో సుమారు ఐదుగురు వరకు యువకులు పనిచేస్తుంటారు. వీటిపై నిషేధం విధించడంతో వీరంతా ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడనుంది.

చేతివృత్తుల వారికి డిమాండ్...

ప్లాస్టిక్ బ్యానర్లకు వస్త్ర బ్యానర్లు ప్రత్యామ్నాయం అని ప్రభుత్వం చెబుతోంది. ప్రింటింగ్ ఫ్లెక్సీలు రాక ముందు వస్త్రాలపై పలు రకాల రంగులతో చేతితో రాసినవే వినియోగించేవారు. గతంలో వందలాది మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఫ్లెక్సీలు రావడంతో నాదు వారూ జీవనోపాధి కోల్పోయారు. ప్రస్తుతం తిరిగి వారికి డిమాండ్ రానుంది.

ప్రత్యామ్నాయం ఇలా.....

ఈశాన్య రాష్ట్రాల్లో కొన్నిచోట్ల ఇప్పటికే నూతన సాంకేతికతతో క్లాత్ ఫ్లెక్సీ ప్రింటింగ్ బ్యానర్లు వినియోగిస్తున్నారు. ఆ పరిజ్ఞానం మనకు అందుబాటులోకి రాలేదు. అధికారులు స్పందించి క్లాత్ ప్రింటింగ్ బ్యానర్లు తయారు చేసే సాంకేతికతను ఇక్కడి వారికి అందుబాటులోకి తీసుకువచ్చి, ఆ దిశగా వ్యాపారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ముద్రణ నిలిపివేయాలని సూచనలు చేశాం



ఫ్లెక్సీ యూనిట్‌లల్లో ఈ నెల 26 నుంచి ముద్రణ నిలిపివేయాలని సూచనలు చేశాం. ఇటీవల ఫ్లెక్సీ యూనిట్ దారులకు సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు వివరించాం. నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించడం జరుగుతుందని హెచ్చరించాం. ఈ నెల 26 నుంచి అధికారుల బృందం ఫ్లెక్సీ తయారీ యూనిట్లను విస్తృతంగా తనిఖీ చేయడం జరుగుతుంది. పట్టణంలో ఎక్కడైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అది కట్టించిన వారితో పాటు తయారీదారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేస్తాం. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– కొలిమి షమ్మీ, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి



సత్కారం అందుకున్న సీనియర్ సిటిజన్లతో ఆర్డీఓ రాజకుమారి, కమిషనర్ కొలిమి షమ్మీ, తహసీల్దార్ నగేష్



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సత్తెనపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా సమర్ధవంతమైన పాలకుల ను ఎన్నుకోవచ్చునని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విద్యా కేంద్రం డిగ్రీ కళాశాలలో బుధవారం డిగ్రీ, బీఈడీ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ సమర్థ నేతలను ఎన్నుకోవడం ద్వారా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం లభిస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందే అవకాశాన్ని భారత రాజ్యాంగం కల్పించింద న్నారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లె నుంచి ఢిల్లీ వరకు పాలకులను గద్దెనెక్కించే భవితవ్యాన్ని నిర్ణయించే హక్కు ఓటు ద్వారానే సొంతమన్నారు. ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకో కూడదన్నారు. యువతను చైతన్యపరిచేందుకే జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వ హించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా సీనియర్ సిటిజనులైన జూపల్లి పాల్, పీ.రామకోటయ్య, రొంపిచర్ల పురుషోత్తం, పీ.ఇర్మియా, ఎమ్.పున్నారావు, పీ.పద్మా వతి, కె.కుసుమాంబ లను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. నూతనం గా ఓటు హక్కు పొందిన ఐదుగురు పౌరులకు ఓటు హక్కు ఐడి కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, టీపీఓ రాఘవరావు, ఎన్నికల డిప్యూటీ తాహశీల్దార్ సుజాత, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, ఏఎస్ఓ శివబాబు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య విజయానికి ఓటర్లు పట్టుకొమ్మలు

పెదకూరపాడు: ప్రజాస్వామ్య విజయానికి ఓటర్లు పట్టుకొమ్మలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి అరవకుమార్ అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సినియర్ ఓటర్లు, వికలాంగు ఓటర్లుకు నూతనంగా ఓటు హక్కు పొందిన వారిచే సత్కరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన ,డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన అఖిల, దుర్గా, లక్ష్మీప్రసన్న, శ్రావణి, గాయత్రి, స్వప్నలకు బహుమతులు అందించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జితేంద్ర, మండల విద్యాశాఖాధికారి ఏకుల ప్రసాదరావు, హెచ్ఎం వీరాంజినేయులరావు, రెవెన్యూ సిబ్బంది వెంకట్రావు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిలో..

అమరావతి: అర్హులైన భారత పౌరులందరూ విధిగా ఓటు హక్కును కల్గి ఉండాలని సత్తెనపల్లి ఉపవిద్యాశాఖాధికారి వి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మునగోడు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

క్రోసూరు: క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశ ఎన్నికల కమిషన్ ఏర్పడిన జనవరి 25 వ తేదీ గుర్తుగా 2011 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటర్లు డబ్బుకు తమ ఓటును అమ్ముకోకుండా నీతి, నిజాయితీగా సేవాభావం కలిగిన అభ్యర్థులను ఎన్నుకున్నప్పుడే మన ప్రసజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుందని వివరించారు. అందరూ తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, వీఆర్వోలు, బీఎల్వోలు, పంచాయతీ సెక్రటరీ శరత్‌బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో పటిష్ట ప్రజాస్వామ్యం

నకరికల్లు: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రజలందరూ సక్రమంగా వినియోగించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో, చల్లగుండ్లలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఎల్ఓలు ఓటరు దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ రంగవల్లులతో సందేశాత్మక చిత్రాలను రూపొందించారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లను రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీయువకులు అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా అర్జీదాఖలు చేసి ఓటుహక్కు పొందవచ్చని అన్నారు. ఓటర్లందరూ ఓటుహక్కు విలువ తెలుసుకుని పటిష్ట ప్రజాస్వామ్య ఏర్పాటుకు కృషిచేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

ముప్పాళ్ళ: జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేర సీనియర్ సిటిజన్లను బుధవారం సన్మానించారు. చాగంటివారిపాలెం రైతుభరోసాకేంద్రంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, ఎంఈఓ ఒంగోలురాజు, సర్పంచ్ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్ రామలింగారెడ్డి, శిరిగిరిగోపాలరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకం

సత్తెనపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని 24 వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రగతికి దిశా నిర్దేశం చేయడంలో దీని ప్రాధాన్యం వెలకట్టలేనిదన్నారు. ఓటు హక్కు అనే అస్త్రాన్ని వినియోగించుకోవడం అర్హులైన ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ నిర్మల, బీఎల్వో శైలజ, వెల్ఫేర్ కరీముల్లా,ఎడ్యూకేషన్ ఆనంద్‌భరత్, మహిళా పోలీస్ నళిని, ఏఎన్ఎమ్ జయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

సచివాలయ సిబ్బందికి అవార్డులు

ఓటరు కార్డుకు ఆధారునంబర్ అనుసంధానం, ఫారం-6బి దరఖాస్తుల స్వీకరణ, ఎన్నికల క్లెయిమ్ పరిష్కారం తదితర అంశాల్లో ప్రతిభను చాటినందుకు గాను రాష్ట్రస్థాయిలో అవార్డును మండలంలోని కుంకలగుంట గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ సహాయకురాలు పాలపాటి కోమిలి, జిల్లాస్థాయిలో అదేగ్రామ సచివాలయానికి చెందిన మరో ఇంజినీరింగ్ సహాయకురాలు జడా సౌజన్యలు అవార్డులు అందుకున్నట్లు తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు.



నూతన ఓటర్లతో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న నకరికల్లు తహసీల్దార్ సురేష్, సిబ్బంది



ప్రశంసాపత్రం అందుకుంటున్న సహాయకురాలు పాలపాటి కోమలి



ముప్పాళ్ళలో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

ఉత్తమ ఏఈఆర్ఓగా నగేష్



ప్రశాంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్ నగేష్



కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతులమీదుగా ప్రశాంసాపత్రం అందుకుంటున్న బ్రహ్మారెడ్డి, జేసీ

సత్తెనపల్లి: ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ)గా సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌ను ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఆర్ -2023 నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు బుధవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నగేష్ ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, డేటా ఎంట్రీ ఆపరేటర్ బద్దూరి.బ్రహ్మారెడ్డి, బూత్ లెవల్ అధికారులైన అంకమ్మరావు, రమేష్, సంజీవరావు, సౌజన్యలకు ప్రశంసాపత్రాలను అందించారు. ప్రశంసాపత్రాలు అందుకున్న అధికారులను సహచర సిబ్బంది ప్రత్యే కంగా అభినందించారు.

వృక్షాంజనేయస్వామి వార్షిక వేడుకలు

నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీకాలనీలో వేంచేసి ఉన్న శ్రీవృక్షాంజనేయస్వామి వారి ధ్వజస్థంభ ప్రతిష్టామహోత్సవ ప్రథమవార్షికోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వయంభువుగా వెలసిన స్వామివారు భక్తులకోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కారు. అర్చకులు తుంగతుర్తి విశ్వనాధశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. వేడుకలను పురస్కరించుకుని విశేషంగా అలంకరించిన వాహనంపై సువర్చలా సమేత శ్రీవృక్షాంజనేయస్వామి వార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. పురవీధుల్లోకి స్వామివార్లు రాగా మహిళాభక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గురువారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం పై కేసు నమోదు

సత్తెనపల్లి: ఇంటర్ విద్యార్థిని అదృశ్యం పై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని యువతి (19) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యశిస్తోంది. ఈ నెల 22న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ద్వారా ఎక్కడ వెతికినా సమాచారం లభించక పోవడంతో సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఏమైనా సమచారం తెలిసిన సీఐ 9440796230 ఫోన్ నంబర్లుకు తెలియ చేయాలని పోలీసులు కోరారు.

మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులతో ఎస్ఈబి సిబ్బంది

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరులో ఓ దాబాలో ఆక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. సీఐ వై. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు 75 త్యాళ్ళూరు గ్రామంలోని ఆత్తలూరు రహదారిలో చిర్రా వెంకటరెడ్డి దాభాలో ఉన్న 240 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రిపబ్లిక్ డే గురువారం కావడంతో ఆక్రమంగా విక్రయించేందుకు దశాల వారీగా ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తీసుకొచ్చి నిల్వ ఉంచినట్లు తెలిపారు. వెంకటరెడ్డితో పాటు అతని సహాయం అందించిన పొదిలికూరి శివగోపిని అదుపులో తీసుకుని అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. సహకరించిన కానిస్టేబుల్ శ్రీమన్నరాయణ, శ్రీనివాసరావులను సీఐ వెంకటేశ్వరరావు అభినందించారు.

విజేత బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.90 వేలు చోరీ

సత్తెనపల్లి: పట్టణంలోని విజేత బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిలో గల విజేత బార్ అండ్ రెస్టారెంట్ మూసివేసేందుకు మంగళవారం రాత్రి తాళ్ళాలు వేసే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బల్ల కింద నక్కి ఉన్నాడు. బార్ సిబ్బంది చూసుకోకుండా తాళ్ళాలు వేశారు. బార్ మూసివేసిన విషయం గమనించిన గుర్తు తెలియని దుండగుడు బార్‌లో ఉన్న రూ. 90 వేలు నగదు అపహరించుకు పోయాడు. బుధవారం రెస్టారెంట్ నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి సీసీ ఫుటేజీలను పరిశీలించగా చోరీ జరిగినట్లు భావించారు. బార్ యజమాని మర్రి సుబ్బారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరా లోని పుటేజీల ద్వారా విచారణ చేపడుతున్నారు.

వాట్సాప్ ద్వారా దుష్ప్రచారంపై ఫిర్యాదు

అమరావతి: వాట్సాప్ ద్వారా తనపై దుష్ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ బీసీసెల్ అధ్యక్షుడినని చెప్పుకుంటున్న కంచర్ల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేయాలని అమరావతి డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజా అమరావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాజా మాట్లాడుతూ తాను రియల్ఎస్టేట్ వ్యాపారులను, రైతులను బెదిరించి కోట్లరూపాయలను సంపాదిస్తున్నట్లు : 9959953069 నంబరు ద్వారా వాట్సాప్‌లో తనపై దుష్ప్రచారం చేస్తున్నాడన్నారు. మండల పరిధిలోని పెదమద్దూరు చెందిన ప్యామిలీమెంబరు సర్టిఫికెట్‌లో వాస్తవాలను మరుగుపరిచి ధృవీకరణపత్రం మంజూరు చేయాలని బెదించడం జరిగిందన్నారు. తాను ఒప్పుకోకపోవడంతో కక్షసాధింపు చర్యలుగా వాట్సాప్‌లో తనపై దుష్ప్రచారం మొదలు పెట్టాడన్నారు. కంచర్ల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గర్భిణుల కోసం అత్యాధునిక సదుపాయాలతో లక్ష్య ప్రోగ్రామ్ ద్వారా రూపొందించిన ఆపరేషన్ థియేటర్ బుధవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. ఆపరేషన్ థియేటర్‌ను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, సయ్యద్ ఖాజాల చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు మాట్లాడుతూ లక్ష్య ప్రోగ్రామ్ ద్వారా వైద్యశాలలో ఆపరేషన్ థియేటర్‌ని కొన్ని రూ. లక్షల పెట్టి అత్యాధునిక సదు పాయాలతో ఆధునికరణ చేయడం జరిగిందన్నారు. డ్రైనేజీ సమస్య వల్ల ఆపరేషన్ థియేటర్‌ని ఇప్పటి వరకు వాడుకలోకి తీసుకు రావడం జరగలేదన్నారు. ప్రస్తుతం డ్రైనేజీ సమస్యని పూర్తిగా తొలగింప చేసి ఆపరేషన్ థియేటర్‌నీ అభివృద్ధి కమిటీ సభ్యుల చేతులమీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో ఆక్సిజన్ ప్లాంట్, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ అమర్నాథ్, హెడ్ సిస్టర్ రాధా, సీబా, బయో మెడికల్ ఇంజినీర్ చంద్ర, నర్సులు పాల్గొన్నారు.